మహబూబ్‌నగర్ - డోన్ మధ్య డబ్లింగ్



మూడు దశాబ్దాల స్వప్నం సాకారమవుతుందని నమ్మకం కలిగిన వేళ. పెండింగ్‌లో ఉన్న మహబూబ్ నగర్ - డోన్ వయా కర్నూలు రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం విశాఖ నుంచి వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాల ప్రజలకు మెరుగైన రైల్వే రవాణా సౌకర్యం కలుగుతుంది. రైల్వే రవాణా మెరుగుపడితే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ బలోపేతం అవుతుంది. ఓర్వకల్లు కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. తద్వారా కరువు ప్రాంతమైన కందనవోలు ముంగిట నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేందుకు సమయం కలిసి వస్తుంది. రైళ్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. అలాగే.. ఆదోని బైపాస్ రోడ్డు నిర్మాణానికి కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆదోని పట్టణ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- 179 కి.మీ. రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుద్దీకరణకు రూ.2,208 కోట్లు
- వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఊతం
- రూ.241.99 కోట్లతో ఆదోని బైపాస్ రోడ్డు

కర్నూలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని హైదరాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో సికింద్రాబాద్ నుంచి నంద్యాల జిల్లా డోన్ వయా మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు ప్రధాన రైలు మార్గం ఇది. 295 కి.మీలు పొడువు ఉండే ఈ రైలు మార్గాన్ని 1922లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మీటర్-గేజ్ లైన్‌గా పనులు ప్రారంభించారు. 1929లో పనులు పూర్తి చేశారు. స్వాతంత్య్రం అనంతరం 1993-98 మధ్య బ్రాడ్-గేజ్ రైలు మార్గంగా మార్చారు. ఆ తరువాత విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం విద్యుత్ రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే.. సింగిల్ లైన్ కావడంతో రవాణాలో తీవ్ర జాప్యం కలుగుతోంది. ఎదురెదురుగా రైళ్లు వచ్చినప్పుడు ఆయా రైల్వే స్టేషన్లలో పాసింగ్ కోసం రైళ్లను ఆపేస్తున్నారు. దీంతో రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఎంతో కీలకమైన ఈ రైలు మార్గానికి డబ్లింగ్ (రెండు రైలు మార్గాలు) ఏర్పాటు సహా విద్యుదీకరణ చేయాలనే మూడు దశాబ్దాలుగా రైల్వే ప్రయాణీకులు విన్నవిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు 295 కి.మీలు డబ్లింగ్, విద్యుదీకరణ చేయాలని ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో రైల్వే ప్రయాణీకుల ఆశలు ఆశలుగానే మిగిలిపోయాయి. 2014లో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం రైలు మార్గాల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. అందులో భాగంగా 2016-17లో సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య 85 కి.మీలు డబ్లింగ్ రైలు మార్గం, విద్యుదీకరణ పనులకు రూ.774 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా 2022 నాటికి పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ మర్గాంలో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

మహబూబ్‌నగర్-డోన్ మధ్య డబ్లింగ్‌కు మోక్షం

రాయలసీమ జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మహబూబ్‌నగర్ - డోన్ వయా గద్వాల, కర్నూలు, వెల్దుర్తి మధ్య 197 కి.మీల డబ్లింగ్ రైల్వే లైన్ నిర్మాణం, విద్యుదీకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.2,208 కోట్లతో చేపట్టే పనులకు ప్రధాని మోదీ విశాఖ కేంద్రంగా వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ మార్గం నిర్మాణం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుంది. ఏపీలో కర్నూలు, నంద్యాల జిల్లాలో 54 కి.మీలు, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధివలో 143 కి.మీలు డబ్లింగ్ రైలు మార్గం నిర్మించనున్నారు. ప్రస్తుతం సింగిల్ లైన్ కారణంగా హైదాబాద్ వెళ్లాలంటే మహబూబ్‌నగర్ వరకు పాసింగ్ కోసం ఏ రైలును ఏ రైల్వే స్టేషన్‌లో ఆపేస్తారో తెలియని పరిస్థితి. పాసింజర్ రైలును అయితే గంటల కొద్ది ఆపేస్తున్నారు. ఫలితంగా కర్నూలు నుంచి హైదారాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలంటే 5.30 గంటలకు పైగా సమయం పడుతుంది. డబ్లింగ్ పనులు పూర్తయితే 3-3.30 గంటల్లోగా చేరుకోవచ్చని రైల్వే అధికారులు అంటున్నారు. అదే క్రమంలో హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు మధ్య నడుపుతున్న వందేభారత్ రైలు మరింత తక్కుత సమయంలో గమ్యస్థానం చేరుకుంటుందని అంటున్నారు.

పారిశ్రామిక ప్రగతికి ఊతం

పారిశ్రామిక అభివృద్ధి చెందాలంటే రైలు మార్గం ఎంతో కీలకం. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.2,850 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. వివిధ పరిశ్రమలు ఏర్పాటుకు సన్నహాలు చేస్తుంది. అందులో భాగంగానే జపానీస్, భారత్‌కు చెందిన పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో రూ.14 వేల కోట్ల పెట్టుబడితో సెమి కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు దాదాపు ఓకే చేశారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్ - డోన్ వయా కర్నూలు ప్రధాన రైలు మార్గాన్ని డబుల్ లైన్, విద్యుదీకరణ పూర్తయితే పరిశ్రమ ఏర్పాటుకు మరింత ఊతం ఇచ్చినట్లవుతుంది. కర్నూలు నుంచి ఓర్వకల్లుకు 18-20 కి.మీలు దూరం మాత్రమే ఉండడం ఇందుకు ప్రధాన కారణం. అదే క్రమంలో ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి వేగంగా అభివృద్ధి చెందాలంటే కర్నూలు-నంద్యాల వయా ఓర్వకల్లు రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆదోనివాసుల ట్రాఫిక్ కష్టాలకు చెక్



ఆదోని బైపాస్ రోడ్డు నిర్మాణం

ఆదోని ప్రజల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ ప్రధాని మోదీ రూ.241.99 కోట్లతో నిర్మించే ఆదోని బైపాస్ రోడ్డు నిర్మాణానికి వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. పదేళ్లకు పైగా ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా హగరి నుంచి తెలంగాణ రాష్ట్ర జడ్చర్ల వరకు వయా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు మీదుగా జాతీయ రహదారి-167 నిర్మాణం పనులు చేపట్టారు. ఆదోని నుంచి మంత్రాలయం వరకు ఎమ్మిగనూరు మీదుగా చేపట్టిన పనులు 2012-13లో పూర్తయ్యాయి. ఆదోని పట్టణంలో ఈ జాతీయ రహదారి వెళ్తుంది. ట్రాఫిక్ సమస్యలు దృష్ట్యా ఆదోని-ఆలూరు రోడ్డు నుంచి ఎమ్మిగనూరు రోడ్డు వరకు 7.3 కి.మీల బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 10 మీటర్ల తారు (బీటీ) రోడ్డు, రెండు వైపుల 2 మీటర్లు మట్టిరోడ్డు (సోల్డర్) నిర్మించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భూములు, ఇంటి స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు కల్పించాలి
- గోకులాలను ప్రారంభించాలి
- ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలి
- కలెక్టర్ రంజిత్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, పంచాయతీరాజ్ సీసీ రోడ్లు, ఉపాధి హామీ, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణగిరి, మద్దికెర, కర్నూలు, సి.బెళగల్, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల్లో ఇంకా 75 శాతం అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 10 వేల అర్జీలను గడువులోపు పరిష్కరించాలని తహసల్దార్‌లను ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను కొంత మంది అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయడం లేదని, పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి ఒక్క అర్జీని తప్పకుండా ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలన్నారు.

గోకులాలను ప్రారంభించాలి

అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలో కూడా 10, 11, 12 తేదీల్లో గోకులం ప్రారంభోత్సవాలను నిర్వహించాలన్నారు. జిల్లాలో 370 గోకులాలకు గానూ ఇప్పటి వరకు 268 గోకులాలు పూర్తయ్యాయనీ, పెండింగ్‌లో ఉన్న గోకులాలను కూడా ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌లను, ఎంపీడీవోలను ఆదేశించారు. జీఎస్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన మిస్సింగ్ సిటిజన్ హౌస్ హోల్డ్ మ్యాపింగ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే 0 నుంచి 6 ఏళ్ల పిల్లల వరకు ఆధార్ తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడంలో 97 శాతం, క్లోరినేషన్ చేసే ప్రక్రియలో 87 శాతం సాధించారని, ఈ అంశాలపై నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలు త్వరితతగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- ఉదయం నుంచే ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించిన ఉలేమాలు
- నేటితో ముగియనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా

6

దొంగ దొరికాడు

అర్ధరాత్రి హైదరాబాద్‌లో పట్టుకున్న పోలీసులు 7

కంది ధర పతనం

ఆందోళనలో రైతులు



విక్రయానికి కర్నూలు యార్డుకు రైతులు తెచ్చిన కందులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో కందులకు గత సంవత్సరం క్వింటానికి రూ.10 వేలకు పైగానే లభించింది. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు అనుకూలించి దిగుబడి ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దాకా లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే వ్యాపారులు ధర తగ్గిస్తూ వస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం కందులకు గరిష్ఠ ధర రూ.7,516, మధ్యస్థ ధర రూ.7,249లు, కనిష్ఠ ధర రూ.2,311కు చేరింది. ధర లభిస్తుందనే ఆశతో ఏకంగా 4,881 క్వింటాళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కందులకు రూ.7,550. కనీసం మద్దతు ధరకైనా కందులు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.6,589, మధ్యస్థ ధర రూ.4,900, కనిష్ఠ ధర రూ.4,300 దక్కింది. పూల విత్తనాలపై గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు ఒకే రీతిలో రూ.3,429 పలికాయి. ఆముదాలకు గరిష్ఠ ధర రూ.5,589, మధ్యస్థ ధర రూ.5,489, కనిష్ఠ ధర రూ.5,191 దక్కింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,335, మధ్యస్థ ధర, కనిష్ఠ ధర రూ.2,311 అందింది. శనగలకు గరిష్ఠ ధర, మధ్యస్థ ధర రూ.6,256, కనిష్ఠ ధర రూ.2,010 అందింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,769, మధ్యస్థ ధర రూ.2250, కనిష్ఠ ధర రూ.1589లు పలికింది. ఎండుమిరప కాయలకు గరిష్ఠం రూ.14,309లు, మధ్యస్థం రూ.9,999లు, కనిష్ఠ ధర రూ.1,019లు అందింది. కొర్రలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు క్వింటానికి రూ.3,351లు మాత్రమే పలికింది.

జిల్లాలో హెచ్‌ఎంపీవీ కేసులు లేవు

- మాస్కు ధరించి, వ్యక్తిగత శుభ్రత పాటించాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ



కర్నూలు హాస్పిటల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్‌ఎంపీవీ కేసులు ఎక్కడా నమోదు కాలేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహె చ్‌వో డా.పి. శాంతికళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ వైరస్ ప్రభావం లేదని, వైద్యులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇది సాధారణ ఫ్లూ జ్వరం, జలుబు లాంటిదని, వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపరలు వారితో సన్నిహితంగా మెలగడం, కరచలనం, స్పర్శ వంటి చర్యలతో వ్యాపిస్తుందన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. శ్వాస సంబంధిత సమస్యలు దగ్గు, ముక్కుదిబడ, ముక్కు నుంచి నీరు కారడం ఉండేవారు జన సమూహాలకు వెళ్లకూడదని అన్నారు.

గర్భిణులను 8 వారాల్లో గుర్తించండి

గర్భిణులను 8 వారాల్లోగా గుర్తించి నాలుగు సార్లు ఆరోగ్య పరీక్షలు చేయాలని డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో జరిగిన గ్రామ, వార్డు ఏఎన్ఎంల శిక్షణా శిబిరానికి డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులను ఎనిమిది వారాల్లో గుర్తించి, వారిలో బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులు, క్షయ గుండె జబ్బులు, మూర్ఛ, హైపటైటిస్-బీ, మలేరియా, జ్వరం, కవల పిల్లలు, ప్రసూతి వివరాలను మాతా శిశు సంరక్షణ వార్డులో పొందుపరచాలన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గరి నుంచి 5 సంవత్సరాల వరకు సమయాను సారంగా టీకాలను అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో వంద శాతం వేయించాలని సూచించారు. రాష్ట్ర శిక్షకులు డా. ప్రియాంక, డా. శివప్రసాద్, డా. అనుదీప్తి గర్భిణుల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రెఫర్‌లతో ఆసుపత్రులకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌వో కే. అన్నపూర్ణ, స్టేట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రశాంత్, ఎస్‌వో హేమసుందరం, డెమో శ్రీనివాసులు, పీహెచ్ ఎన్ మీనాక్షి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 118 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో 118 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలం కోటేకల్‌లో 29, కోసిగి మండలంలోని వందగల్లులో 30, కౌతాళం మండలం ఉరుకుందలో 11, మంత్రాలయం మండలం చౌళహల్లిలో 2, పెద్దకడుబూరు మండలం జెల్వాడిలో 2, ఆదోని మండలంలోని వెంగళాపురంలో 9, హొళగుంద మండలం పెద్దహాటెలో 3, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కల్లూరు మండలంలోని ఎ. గోకులపాడులో 8, కర్నూలు రూరల్‌లోని బి. తాండ్రపాడులో 14, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని ఆస్పరి మండలంలోని ఎటేకల్లులో 10, చిప్పగిరి మండలం నగరడోనలో 10 అర్జీలు వచ్చాయన్నారు.

పెరిగిన పత్తి ధర

- క్వింటం రూ.7,545



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఆస్పరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు చాలా రోజుల తర్వాత పెరిగాయి. బుధవారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7545 పలికింది. గత వారంతో పోల్చితే పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 70 శాతం మందిపైగా రైతులు తమ పత్తి దిగుబడులను విక్రయించుకున్నారు. 2290 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5541, గరిష్ఠ ధర రూ.7545, మధ్యస్థ ధర రూ.7269 పలికింది.

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం

- సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను పరిశీలించనున్న పవన్ కల్యాణ్



కర్నూలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఓర్వకల్లు మండలంలో నిర్మించిన సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఆయన పరిశీలిస్తారు. ఉదయం 11 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలదేరి 11.45 గంటలకు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకుంటారు. ప్రత్యేక హెలకాప్టర్ ద్వారా ఓర్వకల్లు, గని సోలార్ విద్యుత్ ప్రాజెక్టు సహా పిన్నాపురం, గుమ్మటంతాండ గ్రామాల మధ్య నిర్మించిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుదుత్పత్తి లక్ష్యంగా పోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజీ) విద్యుత్ సబంధించిన ఇంటిగ్రేటెట్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్ఈపీ) నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల్లో 4,750 ఎకరాల భూములు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి టీఎంసీ నీటిని కేటాయించారు. ప్రాజెక్టు రూ.15 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యం. వైసీపీ ఆయాంలో పనులు మందగించినా.. టీడీపీ కూటమి వచ్చాక వేగం పుంజుకుంది. ఈ ఏడాది మార్చిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులు మీదుగా ప్రారంభించేందుకు గ్రీన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలనకు రావడం కొసమెరుపు. ఏరియల్ వ్యూ తరువాత మధ్యాహ్నం 12.30 గంటలకు అప్పర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 1.25 గంటలకు పవర్ హౌస్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 1.45 గంటలకు టీఆర్సీ వ్యూ పాయింట్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 2.15 గంటలకు అతిథి గృహానికి చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 4.05 గంటల వరకు దేశంలోనే ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టు గురించి సబంధిత అధికారులు ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా 4.50 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

మా మంచి బడి



- ప్రభుత్వ పాఠశాలలో చదువుల వెలుగు
- ఎన్నో విజయాలు సాధించిన చాగలమర్రి హైస్కూల్
- 1,100 మందికి పైగా విద్యార్థులతో కళకళ
- క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మంచి ఫలితాలు
- క్రీడలు.. పోటీ పరీక్షల్లో టాప్

చాగలమర్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో చదువంటే కార్పొరేట్ పాఠశాలల చదువే. అందరూ ఆ వైపు పరుగులు తీస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వ పాఠశాల వాటిని తలదన్నే ఫలితాలు సాధిస్తోంది. ఉత్తమ ఫలితాల్లో, క్రమశిక్షణలో, పోటీ పరీక్షల్లో, క్రీడల్లో తనకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలోనే మంచి బడిగా పేరెన్నికగన్నది. 1948లో బోర్డ్ పాఠశాలగా ఒక గుడిసెలో ప్రారంభమైంది. 1949లో చాగలమర్రికి చెందిన తొమ్మండ్రు గురుమూర్తి 7.10 ఎకరాల స్థలాన్ని పాఠశాలకు దానం చేశారు. ఆ స్థలంలో భవన నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి పాఠశాల ఎదుగుదల ప్రారంభమైంది. 1950లో జెడ్పీ పాఠశాలగా గుర్తింపు పొందింది. అప్పటి నుంచి అత్యున్నత బోధన అందిస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చింది. ఈ పాఠశాల ప్రారంభమై 74 సంవత్సరాలు పూర్తయింది. నానాటికీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 1126 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 785 మంది బాలురు, 351 మంది బాలికలు. ఇంగ్లీషు మీడియంలో 236 మంది విద్యార్థులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

2007 నుంచి 2022 వరకు ఈ పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

క్రీడల్లో ముందంజ

ఈ పాఠశాల బాలబాలికల్లో జాతీయ స్థాయిలో 20 మంది, రాష్ట్రస్థాయిలో 150 మంది ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రశంసాపత్రాలను అందుకుంటున్నారు.

సమస్యలు వీడలేదు

పాఠశాలకు ఇంతటి ఘన చరిత్ర ఉన్నా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు సరిపోయేలా డైనింగ్ లేకపోవడం, మధ్యాహ్న భోజనం పాఠశాల ఆవరణలో చేయాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదు. స్వీపర్, వాచ్‌మెన్ లేరు. విద్యార్థులు తరగతి గదిలో శుభ్రం చేయాల్సి వస్తోంది. పార్కింగ్ షెడ్లు లేకపోవడంతో ఎండలోనే సైకిళ్లు నిలుపుతున్నారు. వంటగది సరిగా లేకపోవడంతో ఆరుబయట వంట చేస్తున్నారు. బాలికలకు మరుగుదొడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. సోషల్, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యలను అధిగమించి..

పాఠశాలలో సమస్యలు ఉన్నప్పటికీ రోజు రోజుకూ విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2016లో పదోతరగతి పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2022 వరకు 5 మంది విద్యార్థులు 10/10 పాయింట్లు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. పాఠశాలలో సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు చక్రం బీడీ షబ్బీర్ అహ్మద్, కొండయ్య రూ.5 లక్షలు నిధులతో పాఠశాల ముఖద్వారం గేటును ఏర్పాటు చేశారు.



పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

అత్యున్నత విద్యాబోధనతోనే..



విద్యార్థులు గురువుల పట్ల భక్తిభావంతో మెలుగుతున్నారు. విద్యార్థులను మా బిడ్డల్లా చూసుకుంటున్నాం. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవాటు చేస్తున్నాం. అందుకే మంచి ఫలితాలు సాధిస్తున్నాం. పోటీ పరీక్షల్లో కూడా విద్యార్థులు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెస్తున్నారు.

-శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయుడు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఈ పాఠశాల నుంచి నలుగురు టీచర్లు అందుకున్నారు. నారాయణమూర్తి, ఐడీ కృష్ణశాస్త్రి, శ్రీనివాసులు, వెంకటరాముడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం సన్మానించి అభినందించారు.



పాఠశాల వ్యవస్థాపకుడు తొమ్మండ్రు గురుమూర్తి విగ్రహం

ఐక్యమత్యంతోనే పాఠశాల అభివృద్ధి



ఉపాధ్యాయుల ఐకమత్యంతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. విద్యార్థులు ఎప్పటి పాఠాలు అప్పుడే నేర్చుకుంటున్నారు. మంచి మార్కులు సాధిస్తున్నారు. అందరి కృషితో మంచి బడిగా పేరు తెచ్చుకోవడం సంతోషాన్నిస్తోంది.

-కృష్ణశాస్త్రి, ఇన్‌చార్జి హెచ్ఎం

క్రమశిక్షణతో విద్యాబోధన..



విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పిస్తున్నారు. చదువులో పోటీతత్వాన్ని పెంచడంలో గురువుల కృషి ఎనలేనిది. వారి కృషి, పట్టుదలతో చదువుతున్నాం. పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తెస్తాం.

- సమీర, పదో తరగతి

ప్రజల్లో నమ్మకం కలిగించాం



మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించడం ద్వారా గ్రామ ప్రజలకు కూడా మాపై నమ్మకం కలుగుతోంది. నా ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఈ పాఠశాలలోనే చదివారు. ఇలా ప్రజల్లో నమ్మకం పెరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వారి పిల్లలను చేర్పుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ప్రభావం తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి.

-మహబూబ్‌బాషా, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు



జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో చైర్మన్, హెచ్ఎం

ప్రభుత్వ పండుగగా వడ్డె ఓబన్న జయంతి



కర్నూలు అగ్రికల్చర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండువగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఎంఎస్ నెంబరు 5 ఉత్తర్వుల మేరకు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న ప్రభుత్వ పండువగా గుర్తించి అన్ని విభాగాల్లో వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేనాటి పాలేగాళ్ల ఆధీనంలో ఉన్న కొన్ని ప్రాంతాలను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి కంపెనీకి అప్పగించే విషయంలో ఘర్షణలు జరిగి క్రమేపి సాయుధ పోరాటాలుగా మారాయి. ఇందులో నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరును ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఈ భీకర పోరులో సైన్యాధ్యక్షుడిగా ఓబన్న పోషించిన వీరోచిత పాత్ర గతంలో అంతగా వెలుగులోకి రాలేదు. వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి దట్టమైన నల్లమల్ల అడవుల్లో సైతం బ్రిటీష్ కంపెనీ సైన్యాన్ని ఊచకోత కోసి వారిని ఉరుకులు పెట్టించడంలో ఓబన్న ముఖ్యపాత్ర పోషించారు. జనవరి 11న ఓబన్న జయంతిని ఏటా నిర్వహిస్తున్నారు. జీవో విడుదల కావడంపై వడ్డెర సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలకు రుణాల పండుగ

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన బీసీ కార్పొరేషన్ జవసత్వాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీవనోపాధి కల్పనకు 50 శాతం రాయతీతో రుణాల మంజూరుకు చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాలో బీసీ, ఈబీసీలు మొత్తం 1844 యూనిట్లును మంజూరు చేసింది. వీటి కోసం రూ.77.69 కోట్లు సబ్సిడీ రుణాలును లబ్ధిదారులకు అందించనున్నారు. వివిధ పథకాల కింద లబ్ధి పొందేందుకు 21 నుంచి 60 సంవత్సరాలలోపు వయసు ఉండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు కుల ధృవీకరణ పత్రం ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తులు ఏపీఓబీ ఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 8 నుంచి 16వ తేదీలోగా చేసుకోవాలి. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.6.40 కోట్లతో 190 యూనిట్లకు బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, సర్వీసెస్ (ఆటో సర్వీసెస్, బ్యాటరీ సర్వీసెస్, కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ గూడ్స్ రిపేర్స్ ఇంజనీరింగ్ వర్క్‌షాపు), వ్యాపారాలు (బేకరీ, ఆటో మొబైల్స్, బ్యూటీ పార్లర్, ఫ్లోర్‌మిల్, ఐరన్‌గేట్ మిషన్) చేసుకుని ఆర్థికంగా స్థిరపడేవారందరికీ రూ.2లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. మెడికల్ షాపులు ఏర్పాటు చేసేందుకు బి ఫార్మసీ, డి. ఫార్మసీ చదివిన నిరుద్యోగులకు అవకాశం కల్పించారు. ఒక్కొక్క షాపుకు రూ.8 లక్షలు అవసరం కాగా, ఇందులో రూ.50 శాతం కింద రూ.4లక్షలు సబ్సిడీ ఇస్తామని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ బుధవారం తెలిపారు.

అహోబిలంలో 10న వైకుంఠ ఏకాదశి

15 నుంచి పార్వేట ఉత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. 10వ తేదీన తెల్లవారు జామున రెండు గంటలకు ధనుర్మాస పూజ నిర్వహించిన అనంతరం నాలుగు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు స్వామి వారిని దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.



ఎగువ అహోబిలంలోని శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామి

15 నుంచి పార్వేట ఉత్సవాలు

అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి పార్వేట ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని మఠం నిర్వాహ కులు తెలిపారు. మకర సంక్రాంతి, ధనుర్మాసం శాత్తుముర్రై పార్వేట ఉత్సవం కోసం ఎగువ అహోబిలం నుంచి జ్వాలా నరసింహ స్వామి దిగువ అహోబిలానికి చేరుకుంటా రన్నారు. దిగువ అహోబిలంలో పార్వేట మహోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్వాలా నరసింహస్వామి ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చేరుకుం టుందని తెలి పారు. దాదాపు 33 రోజుల పాటు స్వామి వారు 34 గ్రామాల్లోని తెలుపుల వద్ద కొలువై ప్రజలచే విశేష పూజలందుకుంటారని నిర్వాహకులు వెల్లడించారు.

రాజకీయాలు కలుషితం: మంత్రి ఫరూక్

పాణ్యం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు కలుషితమయ్యాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అభిప్రాయపడ్డారు. ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల పదో వార్షికోత్సవానికి బుధవారం మంత్రితో పాటు సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ జోక్యంతో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు సివిల్ సర్వీసు చదవాలంటే ఆసక్తి కనబర్చని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో సాంకేతిక కళాశాలలు అభివృద్ధి చెందాయన్నారు. నంద్యాల ప్రాంతం టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్జీఎం కళాశాలతో విద్యా వ్యాప్తి పెరిగిందని ఇందుకు శాంతిరాముడు కృషి ఎంతో ఉందన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థి అసాధారణమైన జీవితానికి ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అవసరమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకర్షించాయి. ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు, ఎండీ శివరాం, రఘురాం, ప్రిన్సిపాల్ గాయత్రి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్

'తిరుపతి ఘటన బాధాకరం'

నంద్యాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీలో తిరుపతిలో జరిగిన దుర్ఘటన బాధాకరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ వారి భక్తుల మృతి తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుందని తెలియజేశారు.

డెయిరీ సొసైటీని ఎలా రద్దు చేస్తారు..?

- చైర్మన్‌తో చేతులు కలిపారు
- ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి



మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

నంద్యాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : చక్రవర్తుల పల్లె పాల ఉత్పత్తిదారుల సొసైటీలో సభ్యత్వాన్ని రద్దు చేయడం సరి కాదని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సదరు డెయిరీకి చెందిన నలుగురు డైరెక్టర్లతో కలిసి బుధవారం నంద్యాలలోని విజయ డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్‌ను కలిశారు. డైరెక్టర్లకు నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ బోర్డు మీటింగ్ పెట్టి సొసైటీని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పలేని ఎండీ డెయిరీ చైర్మన్‌పై తోసేశారు. అనంతరం ఆయన జగత్ విఖ్యాత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ డెయిరీ చైర్మన్‌కు తనపై ఏదైనా కక్ష ఉంటే తనపైనే చూపించాలనిగాని చక్రవర్తులపల్లె సొసైటిని రద్దు చేసి పాల రైతులను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదన్నారు. తాను బకాయిలు ఉన్నట్లు నిరూపిస్తే.. తానే రాజీనామా చేయడానికి సిద్ధమని అన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా బోర్డు మీటింగ్ పెట్టడం, అదీ కూడా నంద్యాల డెయిరీలోను, కర్నూలు డెయిరీలోను కాకుండా చైర్మన్ ఇంట్లో గుట్టుగా బోర్డు మీటింగ్ నిర్వహించి సభ్యత్వం రద్దు చేస్తామని ప్రకటించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు.

నంద్యాల విజయ డెయిరీలో అలజడి..

నంద్యాలలోని విజయ డెయిరీ వ్యవహారం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇరువర్గాలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఆ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల కిందట బోర్డు మీటింగ్ పెట్టి చాగలమర్రి మండలం చక్రవర్తిల పల్లి పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షుడైనా భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- ఉదయం నుంచే ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించిన ఉలేమాలు
- నేటితో ముగియనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా



ఇజితెమాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు కేంద్రంగా జరుగుతున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం రెండో రోజైన బుధవారం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇజితెమా కార్యక్రమానికి మంగళవారం రాత్రికే వేలాది సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. దీంతో బుధవారం తెల్లవారు జాము నుంచే సామూహిక ప్రార్థనలు మొదలయ్యాయి. అలాగే ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి విచ్చేసిన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను బోధించారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఏలోటు రానివ్వకుండా ఇజితెమా నిర్వహణ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ తదితర సదుపాయాలను సమకూర్చారు. అదేవిధంగా ఇజితెమాకు హాజరైన ముస్లింలకు దాతలు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆయా జిల్లాల వారికి వేరువేరుగా భోజన కౌంటర్లను ఏర్పాటు సౌకర్యవంతమైన సేవలు కల్పించారు. అంతేగాకుండా ఆయా రూట్ల మీదుగా వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రదేశాలను కేటాయించి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు పడగ్బందీ చర్యలు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ తరుఫున వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కాగా గురువారం మధ్యాహ్ననికి ఇజితెమా ముగియనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ వారు పేర్కొన్నారు. ఇదిలావుంటే ఇజితెమా ప్రాంగణమంతా ఎక్కడా చూసినా సందడి వాతావరణం నెలకొంది. మారుమూల ప్రాంతమైన ఆత్మకూరులో ఇంతటి భారీ వేడుక జరగడం పట్ల ఇక్కడి ముస్లిం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇజితెమాను సందర్శించిన ప్రముఖులు

ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరుగుతున్న ఇజితెమా కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇజితెమా ఏర్పాట్ల గురించి కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పవిత్రమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం శుభపరిణామమన్నారు. 2019లో కర్నూలులో జరిగిన అంతర్జాతీయ ఇజితెమాకు కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరం అందించినట్లు గుర్తు చేశారు. అనంతరం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో ఇలాంటి పవిత్రమైన కార్యక్రమం జరగడం పుణ్యప్రదమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇజితెమాకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రత్యేకించి ఇజితెమా ముగిసిన అనంతరం తిగిరి వెళ్లే వారికి ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు.



ఇజితెమా ప్రాంతంలో ముస్లింల సందడి



కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం





విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

విద్యార్థులకు వర్చువల్ బోధన

- రాష్ట్రంలోనే ప్రథమంగా కర్నూలులో ఏర్పాటు
- రేపు ప్రారంభించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్



నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ భవనం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి విద్యార్థులకు సులభతరమైన రీతిలో నాణ్యమైన విద్యను అందించేందుకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ వినూత్న రీతిలో చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలో వర్చువల్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ రిసోర్స్ నెట్‌వర్క్ స్టూడియో ఏర్పాటు చేసింది. దీనికి జిల్లాలోని 352 పాఠశాలలను అనుసంధానం చేశారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల చేత లైవ్‌లో క్లాసులను ఇంటరాక్టివ్ మోడ్‌తో పాఠ్యాంశాలను బోధిస్తారు. రోజుకు 24 గంటలు గ్రూపు అందుబాటులో ఉంటుంది. జిల్లాలో తక్కువ వ్యయంతో అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగించి జిల్లా కేంద్రంలో ఈ-లెర్న్ విలాన్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పాఠాలతోపాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత డిజిటల్ పాఠ్య భాగాలను తయారు చేసి యూట్యూబ్ చానల్‌ట సెలవుల్లో కూడా నేర్చుకునే వెసులుబాటు కల్పించారు. అనివార్య కారణాలతో విద్యార్థులు తరగతులకు గైర్హాజరైనా, భూకంపం, వరదలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాఠశాలలకు దీర్ఘకాలంగా సెలవులు ప్రకటించినా పాఠాలు వినే అవకాశం ఉంది.

వర్చువల్ స్టూడియోలో డెమో క్లాసెస్ ఉపాధ్యాయుల చేత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేయడానికి వర్క్‌షాపును నిర్వహించుకునే ఏర్పాట్లు చేశారు. దీంతో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతకు దోహదపడుతుంది. జిల్లాలోని ఆదోని డివిజన్‌లోని మండలాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీన్ని అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. ఎక్స్‌పర్ట్ సబ్జెక్టు ఉపాధ్యాయులచే పాఠ్యాంశాలను బోధిస్తారు. విద్యుత్, నెట్‌వర్క్ సమస్య ఏర్పడితే ఆ మరు సటి రోజు వీడియో ఆఫ్ యూట్యూబ్ చానెల్ ద్వారా పొందవచ్చు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో 2,800 కెమెరాలను, ఐఎఫ్‌టీ (ఇంటరాక్ట్ ప్లాట్ చానల్) ద్వారా స్టూడియోలో బోధించిన ఆన్‌లైన్ పాఠాలు టెలికాస్ట్ అయ్యేలా ఏర్పాటు చేశారు. పాఠ్యాంశాలతోపాటు పర్సనల్ డెవలప్‌మెంట్, క్యారీర్ గైడెన్స్, కొన్ని రకాల రుగ్మతలకు విద్యా ర్థుల ప్రవర్తనా సమస్యలను రూపుమాపేలా సైకాలజీ కౌన్సెలర్ల సెషన్స్‌ను నిర్వహించాలని విద్యాశాఖ ఆలోచిస్తోంది.

రేపు స్టూడియో ప్రారంభం

కర్నూలు నగరం సుంకేసుల రోడ్డులోని నగర పాలక సమావేశ భవనంలో వర్చువల్ క్లాస్ స్టూడియోను శుక్రవారం మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు. స్టూడియోను విద్యాశాఖ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పనులను శరవేగంగా నిర్వహించేలా డీఈవో శామ్యూల్ పాల్ చర్యలు తీసుకుంటున్నారు.

జైళ్లలో కుల వివక్షపై తనిఖీ

కర్నూల లీగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచలింగాలలోని జిల్లా జైలు, నగరంలోని మహిళల జైళ్లలో కుల ఆధారిత వివక్ష, ఇతర రకాల వివక్షలు ఏమైనా జరుగుతున్నాయా అని తెలుసుకోవడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా జైలులో కుల ఆధారిత వివక్ష గురించి ఆయన ఆరా తీశారు. కులమత బేధాలు లేకుండా ఖైదీలు సత్ప్రవర్తనతో తమ శిక్ష కాలాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబరు 15100ను డయల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఖైదీలను తప్పనిసరిగా కోర్టు వాయిదాలకు హాజరు పరిచేలా జైలు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖైదీలకు అందించే ఆహారం, ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. అనంతరం ఆయన నగరంలోని మహిళా జైలును కూడా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది పి.వెంకటేశ్వర్లు, కేంద్ర కారాగార సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.



జిల్లా జైలులో రికార్డులను పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కోసిగి దేవరలో అపశ్రుతి

- మారెమ్మ పోతు దాడిలో నలుగురికి గాయాలు..
- ఒకరి పరిస్థితి విషమం

కోసిగి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోసిగి దేవరలో బుధవారం తెల్లవారుజామున మారెమ్మ పోతు ఊరేగింపు సందర్భంగా అపశృతి చోటు చేసుకుంది. మారెమ్మపోతు దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో చంద్ర అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జరిగే మారెమ్మ దేవర సందర్భంగా మారెమ్మ దున్నపోతును ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ. ఊరేగింపు నిర్వహిస్తుండగా మారెమ్మ పోతు దాడి చేసింది. దీంతో కోసిగికి చెందిన చంద్ర, కోడి పెద్ద ఈరన్న, ఆదర్శ్, నరసింహులు, భీమేష్‌తోపాటు మరి కొంత మంది గాయపడ్డారు. చంద్ర అనే యువకుని గొంతులో మారెమ్మ పోతు కొమ్ము బలంగా తగలడంతో స్వరపేటిక దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆ యువకుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఆసుపత్రికి తరలించారు.

10న ప్రజాభిప్రాయ సేకరణ

- రెండో రోజూ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌ఈ

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై ఈ నెల 10న నిర్వహిస్తున్న బహిరంగ ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఈ ఎం.ఉమాపతి కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో విజయవాడలో రెండవ రోజూ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. బుధవారం కర్నూలు విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన విడియో కాన్ఫరెన్‌లో ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి పాల్గొన్నారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన బహిరంగ, వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు అభ్యంతరాలను తెలిపారు. ముఖ్యంగా శుక్రవారం కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై నిర్వహించే ప్రజా అభిప్రాయ సేకరణలో సూచనలు, సలహాలు, అభ్యంతరాలను తెలియజేయాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ఓబులేసు, ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్‌ఈ ఉమాపతి

కందుల వ్యాపారికి జరిమానా

ఆస్పరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం గ్రామానికి చెందని కందులు, శనగల వ్యాపారి రంజాన్ తూకంలో మోసానికి పాల్పడడంతో ఆయనకు రూ.50 వేల జరిమానా విధించినట్లు బుధవారం ఆదోని తూనికలు, కొలతల శాఖ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులను 50 కిలోలుగా తీసుకోవాల్సి ఉండగా అదనంగా 54 కిలోలు తీసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. దీంతో తూనికలలో మోసానికి పాల్పడినట్లు వెల్లడైందని తెలిపారు. డిజిటల్ కాటాలో మోసాలకు పల్పాడినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు.

వృద్ధురాలి గల్లంతు

హాలహర్వి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపురం గ్రామంలో రత్నమ్మ (70) అనే వృద్ధురాలు ఎల్లెల్సీలో గల్లంతైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ కడుపు నొప్పి తాళలేక మనస్తాపానికి గురై కాలువలో పడి మృతి చెందిందని నీళ్లలో మునిగిపోయిన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆలూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలోని సర్వే నెంబరు 1లో ఆక్రమణకు గురైన హంద్రీనది పోరంబోకు భూమిలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్ శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన తహసీల్దారు ఆధ్వర్యంలో సాయంత్రం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకునే క్రమంలో ఆక్రమణదారులు భూమిని వ్యవసాయేతర భూమిగా ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నట్లు పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ప్లాట్లుగా మార్చిన వెంచర్‌లో హద్దు రాళ్లుగా మొక్కలు నాటి రెవిన్యూ అధికారుల కళ్లుగప్పేందుకు కబ్జాదారులు కుట్రకు పాల్పడ్డారు.. ఆపై ఏకంగా ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తోలి మట్టి రోడ్డు ఏర్పాటు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రజా అవసరాలకు ఉపయోగించాల్సిన హంద్రీ నది పోరంబోకు భూమి ఆక్రమణకు గురికావడం పట్ల గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం అవుతున్నాయని వార్త ప్రచురించిన నేపథ్యంలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు ఆదేశాల మేరకు చిన్నటేకూరు గ్రామ వీఆర్వో రామాంజనేయులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కల్లూరు తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. చిన్నటేకూరు సర్వే నెంబర్ 1 హంద్రీ పోరంబోకు భూముల్లో కబ్జాలకు పాల్పడితే సెక్షన్ 3 పీడీపీపీ యాక్ట్ 1984, సెక్షన్ 7, ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టం 1905 ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కె.ఆంజనేయులు స్పష్టం చేశారు.

ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపులో జాప్యమెందుకు?

- వైద్యం అందక ఎవరైనా మరణిస్తే సీఎందే బాధ్యత
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

పత్తికొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం బిల్లుల చెల్లింపులో కూటమి ప్రభుత్వం జాప్యమెందుకు చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం పత్తికొండకు వచ్చిన ఆయన స్థానిక ఎస్ఆర్ స్వగృహంలో మాజీ కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.3వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. నిధులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం సరికాదని అన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సర్వీసులను నిలిపివేయాని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందక ఎవరైనా మరణిస్తే అందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆ తరువాత సీఎం చంద్రబాబుపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేసేలా న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామన్నారు. కూటమి రూ.75వేల కోట్లు అప్పులు తెచ్చినా సూపర్ సిక్స్, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్‌చార్జీలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రజానీకంపై రూ.15 వేల కోట్లు అదనపు భారం పడిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన గాడి తప్పిందన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ క్యాలెండర్ విడుదల సంక్షేమ పథకాలు అందించిచామని చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రామకొండ సుధాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భరత్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు

- అర్ధరాత్రి హైద్రాబాదులో పట్టుకున్న పోలీసులు



దొంగను మీడియాకు చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగ ఎట్టకేలకు దొరికాడు. అర్ధరాత్రి హైద్రాబాదులో ఆదోని పోలీసులను చూసి పరుగులు పెట్టిన మురళీని త్రీటౌన్ పోలీసులు వెంట పడి పట్టుకున్నారు. ఆదోని పోలీసులను ఎస్పీ బిందు మాధవ్ అభినందించి, ఇలాంటి ఘటన పునరావృతం కాకూడదని నేరస్థుల విషయంలో జాగ్రత్తలను పాటించాలని సెట్ కాన్ఫరెన్స్‌లో సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మొహినాబాదు మండలం సూరగాలి గ్రామానికి చెందిన మురళీపై తెలంగాణ, ఆంధ్రాలో 70 కేసులు నమోదయ్యాయి. 5వ తేదీన దొంగతనం కేసులో కోర్టుకు తరలిస్తుండగా, పోలీసుల కళ్లుగప్పి కోర్టు గోడదూకి పరారయ్యాడు. దీంతో ఆంధ్రజ్యోతి మంగళవారం కోర్టు గోడ దూకి, బుధవారం దొంగ దొరకలేదు... అనే కథనాలను ప్రచురించింది. ఎస్పీ సీరియస్ కావడంతో దొంగను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలు హైద్రాబాదుకు చేరుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటిన తరువాత మఫ్టీలో పోలీసులు మురళీ ఇంటికి చేరుకున్నారు. పోలీసులను గుర్తించిన దొంగ తన ఇంటి గోడ దూకి పరారయ్యాడు. పోలీసులు దొంగను వెంటాడి పట్టుకొని ఆదోనికి తరలించారు. దొంగను రిమాండ్‌కు తరలించామని సీఐ సూర్య మోహన్ రావు తెలిపారు.

కాల్వబుగ్గ ఆలయాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతాం: మల్లెల



కాల్వబుగ్గలో పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఇంజనీర్లు

ఓర్వకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాన్ని నందన వనంగా తీర్చిదిద్దుతామని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆల యాన్ని మల్లెల రాజశేఖర్‌తోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈ లక్ష్మిపతి, జ్యోతిష్యుడు, వాస్తు మునిశంకర్, కర్నూలు దేవదా య శాఖ డీఈ శ్రీనివాస ప్రసాద్, ఏఈ రవికుమార్, ఈవో మద్దిలేటి పరిశీలించారు. వారికి ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని చిన్న, పెద్ద కోనేరులను పరిశీలించారు. టీటీడీ చైర్మన్ నాయుడు, ఈవో శ్యామలారావుకు మల్లెల రాజశేఖర్ రూ.12కోట్ల పనులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికను బోర్డు సభ్యులకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో టీటీడీ ఆదేశాల మేరకు ఆలయ వారు కాల్వ బుగ్గను సందర్శించారు. కాల్వబుగ్గలో రూ.12 కోట్ల 12 లక్షలతో వివిధ పనులు స్టోన్ ఫ్లోరింగ్, పశ్చిమాన 5 అంతస్థుల రాజగోపురం పునః నిర్మాణం, మూడంతస్థుల రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రదేశం చుట్టూ ప్రహరీ నిర్మాణం వంటి పనులను చేపట్టేందుకు నివేదికలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, చంద్ర పెద్దస్వామి, కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, అబ్బీ, బజారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి: డీటీఎఫ్



మాట్లాడుతున్న కరె కృష్ణ

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకట్రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడు దల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో.నెం.117ను రద్దు చేయాలన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వా నించి 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, నెలవారి పదోన్నతులను చేప ట్టాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను మంజూరు చేయాల ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, పత్రికా సం పాదకులు రత్నం యేసేపు, జిల్లా, మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, జగదీష్, రవీంద్ర, వీరేష్, వెంకటాచలం, సోమశేఖర్ పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే పునాది

గూడూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదియని పార్టీ సీనియర్ నేత, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. బుధవారం గూడూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ నాయకులు, కార్యక ర్తలు సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేమ ట వెంకటేశ్వర్లు, సృజన్, పౌలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

ఓర్వకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ఓర్వకల్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్‌బాబు బుధవారం తెలిపారు. 220కేవీ ఏపీ కార్బైడ్స్ నుంచి వచ్చే 33 కేవీ ఓర్వకల్లు ఫీడర్ మెయింటెనెన్స్‌లో భాగంగా గురువారం ఓర్వకల్లు మండలంలోని వచ్చే ఓర్వకల్లు, నన్నూరు, కాల్వబుగ్గ, ఉయ్యాలవాడ సబ్ స్టేషన్ పరిధిలోని అగ్రికల్చర్ ఫీడర్‌లో అగ్రికల్చర్ సరఫరా ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు వ్యవసాయానికి కరెంటు సరఫరా వస్తుందని, ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

హుశేనాపురంలో ఉరుసు

ఓర్వకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనా పురం గ్రామంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మీరాసావలి నాసర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వహ కుడు ఎస్.షరీఫ్ బుధవారం తెలిపారు. 13న సర్కార్ గంధం, 14న ఉరుసు, 15న కిస్తీలు జరుగుతాయన్నారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ హాజరవుతున్నారన్నారు.

● **14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు:** ఉరుసు సందర్భంగా ఈనెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కుడు ఎస్.షరీఫ్ తెలిపారు. మొదటి నుంచి నాలుగు బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదును అందించను న్న ట్లు నిర్వహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొను టీం సభ్యులు ప్రవేశ రుసుం రూ.500లు చెల్లించాలన్నారు. వివరాల కోసం 9949073763, 7989464141 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పండ్ల తోటల్లో అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చు

సి.బెళగల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల్లో రైతులు అంతర్ పంటలను కూడా సాగు చేసుకోవచ్చని కోడుమూరు ఉద్యాన వనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. బుధవారం మండలం లోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని రైతులతో సమావేశమయ్యారు. హార్టికల్చర్ అసి స్టెంట్లు చెంచురాజు, నాగన్న, నాయక్, భరత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫి కేషన్, జాబ్ క్యాలెండర్‌పై జిల్లాకు వస్తున్న మంత్రి నారా లోకేశ్ స్పష్టమైన హామీ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాం డ్ చేశారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వస్తే వెంటనే రాష్ట్రం లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధ్యక్షుడు రాఘవేంద్ర, సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, రంగప్ప, మల్లేష్ పాల్గొ న్నారు.

పల్లెకు అభివృద్ధి పండుగ

ముమ్మరంగా సీసీ రహదారులు, డ్రైనేజీ పనులు

కోడుమూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టింది. మండ లంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 2.60 కోట్లతో పనులకు ఇటీవల భూమిపూజ చేశారు. ఈ పనులు ముమ్మరంగా సాగు తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో సర్పంచ్‌లు సైతం ప్రభుత్వ ముందుచూపును హర్షిస్తున్నారు.

● **బైనదొడ్డికి సీసీ రహదారి:** పులకుర్తి మజరా బైనదొడ్డి గ్రామానికి గతంలో కంకర తేలిన రహదారి ఉండేది. స్టేజీ నుంచి సుమారు 700 మీ టర్ల దూర ప్రయాణానికి ప్రజల ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. రహ దారిపై గుంతలు, రోడ్డుకిరువైపులా కంపచెట్లు. రాత్రిపూట కాస్త ఆలస్య మై గ్రామానికి చేరుకోవాలంటే పురుగుపుట్రా భయం. దీంతో తమ గ్రామానికి బీటీ రహదారి నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇదంతా గతం. అయితే నేడు బైనదొడ్డి గ్రామానికి పల్లెపండుగలో భాగం గా రూ.60 లక్షలతో సీసీ రహదారి నిర్మించారు. అర కిలోమీటరుకు పైగా సీసీ రహదారి ఏర్పాటు కావడంతో ప్రజల ఆనందానికి అవధులు లేవు.

● **గోరంట్లలో రూ. 27 లక్షలతో డ్రైనేజీ:** గోరంట్ల గ్రామంలో బీటీ రోడ్డు వెంట డ్రైనేజీ లేక ప్రజలు ఎన్నోఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎగువన ఉన్న ఇళ్ల నుంచి వ్యర్థపునీరు రోడ్డు వెంట ప్రవహించి కురువ కాలనీ వద్ద నిలిచి మడుగును తలపించేది. అక్కడ మురుగు నీటి నిల్వతో దుర్వాసన వచ్చేది. పల్లెపండుగలో భాగంగా రూ. 27 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇతర గ్రామాల్లో సైతం పల్లెపండుగ కింద చేపట్టిన సీసీ రహదారులు, డ్రైనేజీ పనులు పనులు పూర్తికావచ్చాయి.



నాడు కంకర తేలిన బైనదొడ్డి అప్రోచ్ రహదారి (ఫైల్)



నేడు బైనదొడ్డికి సీసీ రహదారి

మా గ్రామానికి పండుగే



మా గ్రామానికి ఉన్న కంకర రహదారిలో ఇబ్బంది పడుతూ ప్రయాణించేవాళ్లం. రోడ్డుకిరువైపులా కంప పెరిగినపుడల్లా తొలగించుకునేవాళ్లం. అధికారుల దృ ష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కరించలేదు. నెల రోజుల క్రితం సీసీ రహదారికి భూమిపూజ చేశారు. పనులు శరవేగంగా పూర్తి చేశారు. నిజంగా మాకు పండుగే.

- నరసింహ, బైనదొడ్డి

రోడ్డుకిరువైపులా డ్రైనేజీ నిర్మాణం



గత ప్రభుత్వంలో నిధులు లేక అభివృద్ధి పనులు చేపట్టలేక పోయాం. కనీస మరమ్మతులకు కూడా దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఉండేది. వెల్దుర్తి రహదారి వెంట డ్రైనేజీ కాలువలు లేక ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే పల్లెపండుగ కింద మంజూరైన నిధులతో రోడ్డుకిరువైపులా డ్రైనేజీ పనులు చేపట్టాం.

- బాలక్రిష్ణ, సర్పంచ్, గోరంట్ల

విజేతలకు జ్ఞాపికల బహూకరణ



విజేతలతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఇంటర్ కాలేజీ యేట్ సాహిత్య పోటీల విజేతలకు జ్ఞాపికలను బహూకరణ చేశారు. బుధవారం సుంకేసుల రోడ్డులోని స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో యువజన సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో కళాశాల కల్చరల్ అండ్ లిటరరీ యాక్టివిటీస్ కమిటీ సహకారంతో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంటర్ కాలేజీయేట్ సాహిత్య పోటీల బహుమతి ప్రదా నోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా, సెట్కూరు ముఖ్య కార్య నిర్వహణాధికారి వి.దీప్తి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలన్నారు. ప్రిన్సిపాల్ శాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఈ పోటీల్లో తప్పక పాల్గొనాలన్నారు. స్వామి వివేకానంద సంస్థాన్ కర్నూలు ప్రతినిధి జోన్నథన్ విక్లిఫ్ స్వామి వివేకానంద జీవిత విశేషాలను వివరించారు. అనంతరం నిర్వ హించిన వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, క్విజ్ పోటీల్లో మొదటి మూ డు స్థానాల్లో విజేతలకు మెమెంటో, ప్రశంసాపత్రా లు అందజేశారు. వ్యాసరచనలో ఎస్.ఖాజా, షేక్ ఇస్రాథ్, నాజ్, బి.రమేష్, వక్తృత్వంలో జి.తనీషా, డి.సత్య గౌతమి, ఎస్.ఖాజా, క్విజ్‌లో ఎస్.ఉ షారాణి, వి.లక్ష్మి ప్రసన్న, కె.చైతన్య, డిబేట్‌లో: వి.మనోజ్ఞ, ఎస్.నూర్జహాన్, షరాఫ్ సాత్విక కన్సోలేషన్ ప్రైజ్‌లో ఎస్.ఆఫియాలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కల్చరల్ అండ్ లిటరరీ యాక్టి విటీస్ కమిటి చైర్మన్ ఆశా పర్వీన్, అధ్యాపకులు, సెట్కూరు సూ పరింటెండెంట్ శ్యాంబాబు, శ్రీనివాస సింగ్ పాల్గొన్నారు.

24 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీబీసీ క్రీడా మైదానంలో ఈనెల 24 నుంచి 26 వరకు క్రెడాయ్ ప్రాపర్టీ షో అండ్ బిల్‌టెక్ ఎక్స్పో 2025 ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం క్రెడాయ్ సంస్థ కార్యాల యంలో ప్రాపర్టీ షోకు సంబంధించిన బ్రోచర్లను క్రెడాయ్ చైర్మన్ సోమిశెట్టి వెంకట్రామయ్య, క్రెడాయ్ అధ్యక్షుడు సాయిరాం రెడ్డి, కన్వీనర్ ఎన్ శ్రీనివాసరావు, ఏపీ క్రెడాయ్ ఉపాధ్యక్షుడు సురేష్‌కు మార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బ్రిజేష్ సింగ్, మేనేజర్ శంకర్, శృతి ఆవిష్కరించారు. ఇందులో స్పాన్సర్‌గా రాగ మయూరి బిల్డర్స్, కో స్పాన్సర్‌గా స్కందాన్సీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ వ్యవహరిస్తు న్నట్లు తెలిపారు. ఇందులో ఇతర బిల్డర్లు, గృహ నిర్మాణాలకు అవస రమైన మెటీరియల్స్, బ్యాంకర్లు, ఇంటీరియర్స్, ఆటో మొబైల్ రంగాలకు సంబంధించిన వారు ఈ ప్రాపర్టీ షోలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాలుగు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బళ్లారిరోడ్ సెక్షన్ పరిధిలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా బస్టాండ్ ఏరియా, పాత కల్లూరు, మహావీర్ నగర్, మార్కెట్‌యార్డ్, ఇందిరాగాంధీ నగర్ ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

● బీ.క్యాంపు సెక్షన్ పరిధిలో 11 కేవీ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పలు కాలనీల్లో కరెంట్‌కోత ఉంటుందని టౌన్ ఈఈ టి.శేషాద్రి తెలిపారు.

బాలాజీ నగర్‌లో తాగునీటి ట్యాంకు పరిశీలన

కర్నూలు న్యూసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌లో నిరుపయోగంగా మారిన తాగునీటి ట్యాంకును పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ వాసులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మా ట్లాడుతూ బాలజీనగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తాగు నీటి ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి ప్రతి రోజు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలాజీనగర్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.మాణిక్యరెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్.లతీఫ్‌బాషా, న్యాయ వాది ఎం.రవికుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యం లో మంగళగిరిలో జరుగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంటులో అనంతపు రం జట్టుపై ఉమ్మడి జిల్లా బాలికల జట్టు గెలిచింది. అనంతపురం స్కోర్ 8 ఓవర్లకు 56/4, కర్నూలు 57/1 6.3 ఓవర్లు సాధించారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎన్.గిడ్డయ్య, పి.శ్రీనాథ్‌లు తెలిపారు.

ఈవోను కలిసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

కర్నూలు అర్బన్ జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాస్‌ను ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు. సుబ్బయ్య, రామ చంద్రుడు, బాలఉశేనయ్య, రామ్మోహన్, కిట్టు, అశోక్ పాల్గొన్నారు.

శునకాలకు శస్త్ర చికిత్స నిర్వహించాలి

భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు అంజలి గోపాలన్

కర్నూలు న్యూసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శునకాలకు పకడ్బం దీగా శస్త్ర చికిత్సలు నిర్వహించాలని భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు అంజలి గోపాలన్ నగర పాలక అధికారులకు సూచిం చారు. శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రం నిర్వహణకు సంబంధించి అనుమతుల కోసం నగర పాలక సంస్థ భారత జంతు సంక్షేమ మండలికి దరఖాస్తు చేసుకుంది. అందులో భాగంగా మండలి సభ్యురాలు బుధవారం నగరానికి వచ్చారు. నగర శివారులోని గార్గేయ పురం డంప్‌యార్డులోని శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రా న్ని ఆమె సందర్శించారు. ఆమెకు నగర పాలక కమిషనర్ రవీంద్ర బాబు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె కేంద్రంలో ఉన్న శస్త్ర చికిత్స గదులు, శునకాల బోను, తదితర సౌకర్యా లను పరిశీలించారు. నగరంలో శస్త్ర చికిత్సలు జరిగిన, ఇంకా జర గాల్సిన సంఖ్య, కేంద్రంలో శునకాలకు అందించే ఆహారం, శస్త్ర చికిత్స లు నిర్వహించే పద్ధతులపై ఆమె ఆరా తీశారు. శునకాలకు సంతాన నియంత్రణ క్షేత్ర చికిత్సలను పునఃప్రారంభించేందుకు నవోదయ సొసై టీకి ప్రాజెక్టు రికగ్నేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంజలి గోపాలన్ సాను కూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నివారణకు త్వరలోనే సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. నగరంలో ఇప్పటికే 10054 శునకాలకు శస్త్ర చికిత్సలు జరిగాయని, ఇంకా 4 వేలకు పైగా శునకాలకు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందన్నారు. ఒక్కొక్క శునకానికి శస్త్ర చికిత్స నిర్వహించేందుకు నగర పాలక రూ.1500 ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం ఆమె అధికారులతో కలిసి కేంద్రం బయట మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, పశువైద్యాధికారి మల్లన్న, డీఈ గం గాధర్, ఏఈ వైష్ణవి, నవోదయ సొసైటీ అధ్యక్షుడు గిరిబాబు, పాల్గొన్నారు.



శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న అంజలిగోపాలన్

● **ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన..** గతంలోనే శునకాల చికిత్సల కు సంబంధించి సొసైటీకి అనుమతి లేదని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నగర పాలక అధికారులు అనుమతుల కోసం భారత జంతు సంక్షేమ మండలికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో మండలి సభ్యురాలు గార్గేయపురం డంప్‌యార్డులోని శున కాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు.

కేసీ శివారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

కర్నూలు కల్చరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంగీత గురువు కేవీ శివారెడ్డి రంగస్థల రంగానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచి పోతాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియా డారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రంగస్థల సంగీత విద్వాంసుడు, దర్శకుడు దివంగత కేసీ శివారెడ్డి 6వ వర్ధంతి సభ, పౌరాణిక నాటక ప్రదర్శనలు జరిగాయి. కర్నూలులోని కళావా హిని సాంస్కృతిక, సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, కేసీ శివారెడ్డి చిత్రపటానికి కళావాహిని సంస్థ వ్యవ స్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ పర మహంస నాట్య కళా సంస్థను స్థాపించి తద్వారా బుర్రా సుబ్రహ్మణ్యం శాస్త్రి, కేవీ రాఘవరావు, బీసీ కృష్ణ వంటి ప్రముఖులను కర్నూలు నాటక రంగానికి పరిచయం చేసిన ఘనత కేసీ శివారెడ్డికి దక్కుతు ందని గుర్తు చేశారు. కళావాహిని సంస్థ అధ్యక్షుడు మనోహర్‌బాబు మాట్లాడుతూ కేసీ శివారెడ్డి వంటి గొప్ప వ్యక్తుల స్ఫూర్తితో కళాకా రులు మరింత ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాకా రులు పి.దస్తగిరి, చంద్రశేఖర్, గాయకులు సుధారాణి, రమేష్ పాల్గొన్నారు. పౌరాణిక నాటక ప్రదర్శనల్లో నారదునిగా తిరుపాలు, కర్ణగా రోశన్న, చింతామణి నాటకంలో భవానీగా లక్ష్మణరాజు, చింతామణిగా శారదా వాణి, శ్రీకృష్ణగా గజేంద్రనాథ్‌రెడ్డి, అర్జును డిగా వినోద్‌కుమార్, దుర్యోధ నుడిగా నాగేశయ్య ఆయా పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పత్తి ఓబులయ్య

చిరు వ్యాపారుల బండ్లు తొలగింపు

కర్నూలు న్యూసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుత్తి పెట్రోలు బంకు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న చిరు వ్యాపారుల బండ్లను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. ఫ్లైఓవర్ కింద ఇటీవల నగర పాలక సంస్థ నుంచి పార్కింగ్ ఏర్పాటు కోసం టెండరు ద్వారా స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అయితే లీజు తీసుకున్న స్థలం పక్కనే అనధికారింగా కొందరు చిరువ్యాపారులు బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమ ంలో లీజుదారులు నగర పాలక అధికారులకు ఫిర్యాదు చేసారు. పార్కింగ్ స్థలం పక్కనే బండ్లు ఏర్పాటు చేయడంతో తమకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో అనధికారింగా ఏర్పాటు చేసిన బండ్లను తొలగించారు.

సి.బెళగల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పురుషోత్తం

సి.బెళగల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సిబెళగల్ మండల డిప్యూ టీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పురుషోత్తంను ఇన్‌చార్జి తహసీ ల్దార్‌గా ఉత్తర్వులు అందినట్లు సమాచారం. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి అనారోగ్య కారణాలతో దీర్ఘకాలికంగా సెలవుపెట్టడంతో జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పురుషోత్తంకు బాధ్యతలు అప్పగించినట్లు సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

గూడూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైఎస్సార్ కాంగ్రె స్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా నియమి తులైన వైసీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం పార్టీ అధ్యక్షుడు పీఎన్ అస్లాం అన్నారు. బుధవారం గూడూరులో అస్లాంను పార్టీ నాయకు లు ఘనంగా సన్మానించారు. నగర పంచాయతీ రెండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

గూడూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచిక లపాడు, గుడిపాడు, నాగులాపురం, జులకల్, ఆర్.కానాపురం గ్రామాల్లోని శనగ పంటను ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన నంద్యా ల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త ఏ.రామకృష్ణారావు బుధ వారం పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంట కాయ ఏర్పడే దశలో ఉందని, లద్దె పురుగు, కాయతులిచే పురుగు ఉధృతి తక్కువ స్థాయి నుంచి మధ్యస్థంగా ఉన్నట్లు గుర్తించామ న్నారు. దీనికి సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. కార్యక్రమంలో పెంచికలపాడు గ్రామ రైతు క్రిష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, బ్రహ్మయ్య, నగేష్, రైతు సేవా కేంద్రాల వీఏఏలు పాల్గొన్నారు.



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయండి

కర్నూలు అర్బన్ జనవరి 8(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలో విద్యార్థుల అభ్యున్నతికి ఎస్ఎఫ్ఐ కృషి చేయాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, పరీక్షల డీన్ సుందరానంద్ పుచ్చా, పరీక్షల నిర్వహణాధికారి వెంక టేశ్వర్లు, లైబ్రరీ ఇన్‌చార్జి నాగభూషణంతో కలిసి ఉపకులపతి ఆవిష్కరించారు.

యూటీఎఫ్ పత్రిక ప్రధాన సంపాదకుడిగా సురేష్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరి గిన యూటీఎఫ్ రాష్ట్ర 17వ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో కర్నూ లు జిల్లాకు చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కే.సురేష్ కుమార్ ను ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఐక్య ఉపాధ్యాయ పత్రిక చీఫ్ ఎడిటర్‌గానూ కొనసాగనున్నారు. యూటీఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రవి కుమార్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎర్రజెండ రాజ్యం రావాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యల పరిష్కారం కావాలంటే ఎర్రజెండ రాజ్యం రావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గత ఎనిమిది రోజులుగా సీపీఐ నగర సమితి అధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వరంగలను ప్రైవేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నాయకులు శేషా ద్రిరెడ్డి, పి.రామక్రిష్ణారెడ్డి, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

11న శ్రీరాముల వారి శోభా యాత్ర

కర్నూలు కల్చరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్స వం సందర్భంగా ఈనెల 11న నగరంలో శ్రీరాముల వారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు సీతారాముల కళ్యాణోత్సవ సమితి ప్రతినిధులు తెలిపారు. బుధవారం పాతనగరంలోని లలితా పీఠంలో శోభాయాత్ర వివరాలు తెలిపే ఫ్లెక్సీ బ్యానర్లు, కరపత్రాలు విడుదల చేశారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె.క్రిష్ణన్న మాట్లా డుతూ శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారన్నారు.

16న ఇంటర్వ్యూలు

కర్నూలు హస్పిటల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో గురువారం జరగాల్సిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు డీఎంహె చ్‌వో డా.పి.శాంతికళ ఓ ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఈ నెల 16వతేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. గురువారం ఎఫ్ఎన్‌వో పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.

మిరప రైతు కన్నీరు

- ఆలూరు మండలంలో పంటకు తెగులు, వాతావరణ ప్రభావంతో తగ్గిన దిగుబడి
- ఆస్పరి మండలంలో దిగుబడి వచ్చినా ధర లేదు
- లబోదిబోమంటున్న రైతులు


మిరపకాయలకు మచ్చ తెగులు


కాయలను చూపుతున్న రైతు కురుకుంద

ఆలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 3,375ఎకరాల్లో మిరప సాగుచేశారు. ఆలూరు, కురకుంద, ముద్దనగేరి, హత్తిబెళగల్, అంగసకల్, అరికేర, హలేబీడు తదితర గ్రామాల్లో మిరప పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరిగింది. ఇంతలో పంటను మచ్చ తెలుగు ఆశించడంతో పంట దెబ్బతింది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఇంతకు ముందు ఎకరాకు 10-15 క్వింటాళ్లు దిగుబడి వచ్చేది. తెలుగు ప్రభావంతో ప్రస్తుతం 6-7 క్వింటాళ్లు మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయంలో హార్టికల్చర్ అసిస్టెంట్ హన్నప్ప మాట్లాడుతూ రైతులకు సూచనలిస్తున్నామని, వాటి ప్రకారమే పురుగుమందులను పిచికారీ చేయాలని సూచించారు.

పురుగు మందులు వాడినా..

పంటను కాపాడుకోవడానికి వారంలో రెండుసార్లు పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగులు సోకి కాయలు కుళ్లిపోవడం తోదిక్కు తోచని స్థితిలో ఉన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మచ్చ తెగులుతో నష్టం

నాకు ఉన్న ఎకరన్నార పొలంలో మిరప సాగు చేశాను. రూ.2.3 లక్షలు ఖర్చు చేశాను. మచ్చ తెగులు సోకి కాయలు కుళ్లిపోయాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. **- శ్రీరాములు, రైతు కురకుంద**

పతనమైన ధర..


మిరప దిగుబడి చూపుతున్న రైతు ఉరుకుందప్ప

ఆస్పరి, జనవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 700 హెకార్లల్లో మిరప సాగు చేశారు. అధికంగా దొడగొండ, కైరుప్పల, పుటకలమర్రి, వలగొండ, కల్లపరి, శంకరబండ తదితర గ్రామాల్లో మిర సాగు చేశారు. పంట బాగా రావడంతో రైతులు ఆనందించారు. ఇంతలోనే ధర పతనమవడంతో వారి ఆనందం ఆవిరైంది.

ధర భారీగా పతనం

రెండేళ్ల క్రితం క్వింటం ధర రూ.90వేలు పలికింది. అయితే ఈ ఏడాది ఏకంగా రూ.6 వేలకు పడిపోవడంతో రైతులు లబోదిబో మంటు న్నారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు సాగు చేశామని ఇలా అయితే ఎలా పంటలు సాగు చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఎకరాకు రూ.లక్ష ఖర్చు

రెండు ఎకరాల్లో మిరప సాగుచేశా. ఎకరాకు రూ.లక్ష ఖర్చు అయింది. ఎకరాకు మూడు క్వింటాళ్ల చొప్పున దిగు బడి వచ్చింది. అయితే ధరలు పతనం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. **- ఉరుకుందప్ప, రైతు, కల్లపరి**

ప్రభుత్వం ఆదుకోవాలి

గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్న మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పొలంలో రూ.2 లక్షలు దాకా పెట్టుబడి పెట్టి మిరప పంట సాగు చేశాను. ప్రస్తుత పలుకుతున్న ధరల వల్ల పెట్టిన పెట్టుబడులు అప్పుగా మిగిలాయి. **- వీరేష్ రైతు, దొడగొండ**

భూకబ్జా సూత్రధారులేరీ?

ఆదోని టౌన్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): రూ.40కోట్ల విలువ చేసే భూకబ్జా విషయంలో పాత్రదారులు దొరికారని, మరి సూత్రధారుల సంగతి తేల్చాలని మైనార్టీ హక్కుల సమితి కార్యదర్శి నూర్ అహమ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ మధ్యకాలంలో ఆదోని ప్రాంతంలో భూకబ్జాలు చోటుచేసుకుంటుండంతో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వెల్దుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ కార్యదర్శి వర్గసభ్యుడు జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోడానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర వర్మకు వినతి పత్రం అందజేశారు. కృష్ణ, చిన్నమాదులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎంత పంచినా తరగనిది విద్య


పుస్తకాలు అందిస్తున్న దాత వీఆర్ యాదవ్

మద్దికెర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎంత పంచినా తరగనిది విద్య అని డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన డా.వీఆర్ యాదవ్, ఎంఈవో రంగస్వామి అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పెద్ద ఎర్ర వెంకట సేవా సంస్థ ద్వారా పుస్తకాలు ఇచ్చామన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.రంగన్న, ప్రిన్సిపాల్ సవిత, నాగరాజు, విశ్వనాథ్ ఉన్నారు.

రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పొలిమేరలోని రణమండల కొండలల్లో సీసీరోడ్డు ఛిద్రమయ్యాయి. ఈనెల 3వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'అధ్వానంగా రణమండల కొండ దారి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ సాయి వీరేష్ రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేస్తామని తెలిపారు. అధికారులను సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ అభినందించారు.

రంగవల్లులు సంస్కృతికి నిదర్శనం


బహుమతులు అందిస్తున్న డా.గోపీనాథ్

ఆదోని టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రంగవల్లులు మన సంస్కృతికి నిదర్శనమని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డా.గోపీనాథ్ అన్నారు. లయన్ క్లబ్, ఆవోపా, వామ్ సంస్థలు సంయుక్తంగా బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలు రాజేశ్వరి, భవాని, సాయి భవిత, ఉషారాణి, అంజలికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యులు వన్నప్ప రాజు, ఓం ప్రకాష్, డా రంజిత్, వెంకటేశ్వరులు, శ్రీదేవి, అనూష, ఈరన్న శెట్టి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేయించండి

వెల్దుర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని ఐసీడీఎస్ పీడీ నిర్మల ఆదేశించారు. బుధవా రం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను ఆరా తీశారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో సుమారు 2,500 మంది చిన్నారులకు ఆధార్ నమోదు కాలేదని, సూపర్‌వైజర్లు టీచర్లు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని నమోదు చేయిం చాలని ఆదేశించారు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీడీపీవో లూక్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

- ఐసీడీఎస్ పీడీ నిర్మల



ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి

పత్తికొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి 93వ జన్మదిన వేడుకలు నిర్వహిం చారు. తనయుడు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, కేడీసీసీబీ మాజీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ పల్లె ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ కొమ్ముదీపిక, మాజీ సర్పంచ్ సోమశేఖర్, పాల్గొన్నారు.

మహిళపై లైంగిక వేధింపులు.. ఇద్దరిపై కేసు

ఆదోని రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై పెద్ద హరివాణం గ్రామానికి చెందిన బండి తిమ్మప్ప, సంతేకూడ్లురు గ్రామానికి తిక్కప్ప లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాధితురాలు ఇస్వి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై లైంగిక వేధింపులతో పాటు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

అదుపులో సారా విక్రేతలు

ఆదోని రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇస్వి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. బోయగేరికి చెందిన రాజు సారా తరలిస్తుండగా ఇస్వీ శివారుల్లో అదుపులో తీసుకొని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకన్నారు. అలాగే సుల్తాన్ పురం గ్రామంలో సారా విక్రయిస్తున్న వినోద్ కుమార్ గౌడ్‌ను అరెస్ట్ చేసి, 25లీటర్ల సారానుస్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రీ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం

తుగ్గలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే రీ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కామవుయాని తహసీల్దార్ రమాదేవి అన్నారు. బుధవారం పగిడిరాయి గ్రామంలో రీసర్వే ప్రాజెక్టుపై రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. రీసర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా పగిడిరాయి గ్రామం ఎంపికైందని, 20వ తేదీ నుంచి రీసర్వే ప్రారంభమవుతుందన్నారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో నయోమి, రైతులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఆస్పరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ డిసెంబరు 6న ప్రారంభించామని రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు దోహద పడ్డాయన్నారు. తమ పరిధి లోని అర్జీలను పరిష్కరించామని మిగతావాటిని ఉన్నతాధికారులకు పంపామన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు

ఆలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీవో నెం. 53 ప్రకారం మాదాసి మదారి కురవలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వరాదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది కోరారు. బుధవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి మాదాసీ, మాదారి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే వారిపై క్రిమినల్ కేసులతో పాటు, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, భారత్, లక్ష్మినారాయణ, ఈరన్న, వెంకట రాముడు, చంద్ర పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహానంది

ధ్రువపత్రాలు తీసుకురండి

వెల్దుర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రహరీ ఆనుకుని ఉన్న దుకాణ యజమానులు ధ్రువపత్రాలను తీసుకురావాలని ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. సర్వే నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని పాఠశాల విద్యా కమిటీ వారు ఫిర్యాదు చేశారని, దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.రియాజ్ రాష్ట్రస్థాయి తక్రా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శివప్రసాద్ తెలిపారు. ఆలూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపాడని, 17,18 తేదీల్లో ప్రకాశం జిల్లాలో పాల్గొంటాడన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయులు చిన్న బాబును ఉషారాణి, శంకరయ్య అభినందించారు.

ఛైర్మన్ పదవి ఇవ్వాలి

దేవనకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పొత్తులో భాగంగా దేవనకొండ సింగల్ విండో ఛైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ కన్వీనర్ బోడ రవికుమార్ కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకుపోతోందని, నామినేటేడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని అన్నారు.

రెవెన్యూ స్థలాలు ఆక్రమిస్తే మా దృష్టికి తీసుకురండి

మద్దికెర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ స్థలాలను ఆక్రమిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ సూచించారు. బుధవారం కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఎవరికి పడితే వారికి పట్టాలు ఇవ్వకుండా విచారణ చేసి ఇవ్వాలన్నారు.

కులం సర్టిఫికెట్లపై విచారణ


విచారణ చేస్తున్న తహసీల్దార్

వెల్దుర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గతంలో జారీచేసిన మాదాసి కురువ కులం సర్టిఫికెట్లపై బుధవారం తహసీల్దార్ చంద్రశేఖవర్మ, డీటీ గురుస్వామిరెడ్డి విచారణ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామన్నారు. చెరుకులపాడులో తహసీల్దార్, కలగొట్లలో డీటీ విచారణ చేశారు.

అందుబాటులో ఉండాలి

దేవనకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల్లో వీఏఏలు అందుబాటులో ఉండాలని ఏడీఏ మోహన్ విజయ కుమార్, ఏవో సురేష్‌బాబు ఆదేశించారు. బుధవారం దేవనకొండ రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. రైతులు రబీ పంటలను రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో 7వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారని, ఏడు వందల మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని, ఫసల్ భీమా వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మిరప రైతులు జాగ్రత్తలు పాటించి ఆకుముడత తెగుళ్ల, నలిదోమ నివారణకు పంటకు గాలి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలని సూచయించారు. పచ్చదోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి దస్తగిరి తెలిపారు. ఏఈవోలు రంగన్న, మల్లికార్జున, సలాం పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల వద్ద హాస్టల్ విద్యార్థు లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఆలూరు ఎమ్మెల్యే


జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆలూరు, జనవరి8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి బుధవారం కలిశారు. తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, నియోజకవర్గ సమస్యలపై ప్రధానంగా చర్చించినట్లు వివరించారు.

టీడీపీతోనే అభివృద్ధి

తుగ్గలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బాలన్న, విద్యాకమిటీ ఛైర్మన్ మిద్దె రవి అన్నారు. బుధవారం మండలంలోని జొన్నగిరిలో మాట్లాడుతూ ఐదు నెలల్లోనే ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేశారన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ ఇచ్చారని, గత వైసీపీ హయాంలో గుప్పెడు మట్టి, సిమెంటు కూడా వేయలేదని ఆరోపించారు.

కంది సిరులు


జొహరాపురంలో కందులను తూర్పారబడుతున్న రైతు

- ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి

మండలంలోని జొహరాపురం, ఆస్పరి, చిన్నహోతూరు గ్రామాల్లో కంది సాగు చేశారు. ఈ ఏడాది దిగుబడి బాగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 6 క్వింటాళ్ల వరకు వచ్చిందని, ఎర్ర, నల్లరేగడి నేలల్లో దిగుబడి బాగా వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **- ఆస్పరి**

సమయం సద్వినియోగంతో విజయం


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో, ఎంఈవో, ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): సమయం విలువైందని, సద్వినియోగం చేసుకుంటే పదో తరగతిలో విజయం సాధించవచ్చునని డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎస్టీయూ రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను మున్సిపల్ నెహ్రూ మెమోరియల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఈ మెటీరియల్‌ను రూపొందించారని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, దాతలు నాగరాజు, బీచ్ పల్లి ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, వీర చంద్ర యాదవ్, లోక్యానాయక్, రవి, భీమరాజు, సత్యనారాయణ, ప్రహల్లాద, సుధాకర్, రాజాసతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

మద్దికెర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ వీధిలో సీసీ రోడ్డు పనులను పీఆర్ ఏఈ విష్ణు, జడ్పీటీసీ సభ్యుడు డి.మురళీధర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. జడ్పీ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నా మని, బస్టాండు వద్ద కూడా రోడ్డు వేశామన్నారు. బండారు ఆంజనేయులు, కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

ఫిర్యాదులను నెలాఖరులోగా పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు తహసీల్దార్ గోవింద్ సింగ్



ఆలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులను నెలాఖరులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులు ఎలా నిర్వహిస్తున్నారు?

జవాబు: ముందు రోజే గ్రామాల్లో ప్రచారం చేయడంతో ప్రజలు సదస్సులకు హాజరై తమ సమస్యలను చెప్పుకుంటున్నారు.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో నిర్వహించారు?

జవాబు: మండలంలోని 18 గ్రామాల్లో నిర్వహించాం.

ప్రశ్న: ఎన్ని సమస్యలను గుర్తించారు?

జవాబు: 334 దరఖాస్తులు రాగా, 105 దరఖాస్తులను పరిష్కరించాం. మిగతా వాటిని కూడా పరిశీలించి నెలాఖరులోగా పరిష్కరిస్తాం.

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా వచ్చిన సమస్యలేవి?

జవాబు: రీ సర్వే జరిగిన 10 గ్రామాల్లో ఈనాం భూముల సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. మ్యుటేషనులు, సరిహద్దు సమస్యలు, సర్వే నంబర్లలో తప్పులు, తేడాలు, విస్తీర్ణంలో తేడాలపై ఫిర్యాదులు వస్తున్నాయి.

ప్రశ్న: రేషన్ డీలర్ల ఫలితాలు వచ్చాయి కదా. ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తారు?

జవాబు: ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు రెగ్యులర్ ప్రతిపాదికన ఈనెల 5న రాత పరీక్ష పూర్తయింది. 1:5 ప్రకారం ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేశాం. రెవెన్యూ సదస్సుల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేశాం.. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ పత్రికల ద్వారా తెలియజేస్తాం.

పీఠాధిపతికి డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం


పీఠాధిపతికి తులాభారం చేస్తున్న పాదయాత్ర భక్తులు

మంత్రాలయం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం చేశారు. బుధవారం మఠం ప్రాంగణంలోని ఊంజల మండపంలో సిరిగుంప ఆర్యవైశ్య పాదయాత్ర సంఘం అధ్యక్షులు హనుమంతయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు, విష్ణువర్ధన్, విజయకుమార్, రాఘవేంద్ర ఆధ్వర్యంలో తులాభారంలో ఒకవైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, మరో వైపు డ్రైఫ్రూట్స్ గోడంబి, బాదం, పిస్తా, ఎండుఖర్జూరా, గుమ్మడి విత్తనాలు వంటి పండ్లతో తులాభారం చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని, ఇందుకు రాఘవేంద్రస్వామి మఠం తరుపున ఎప్పుడూ పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మఠం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా ఇంటి స్థలాల కోసం ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో ఉండే పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామన్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా ఒక్క ఇంటి పట్టాను కూడా ఇవ్వలేదన్నారు. ఇంటి పట్టాల కోసం చేపట్టే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, భాస్కర్‌యాదవ్, పట్టణ నాయకులు కేసీ జబ్బార్, దాదావళి, రాజీవ్, విజయేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

'పొజిషన్ పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

మంత్రాలయం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల్లో తహసీల్దార్ సంతకాలు లేకుండా పొజిషన్ పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి (వైహెచ్‌పీఎస్) సంఘం జిల్లా అధ్యక్షుడు వై.వీరేష్ కోరారు. బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయంలో పేదలకు ఇంటి నిర్మాణాలు చేపట్టా లని, 16 ఎకరాలు భూమిని సేకరించి 641 ప్లాట్లను వేశారని, మిగిలిన స్థలంలో గతంలో చేసిన సర్వేయర్ నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ స్థలాలను తహసీల్దార్ సంతకం లేకుండా సబ్ డివిజన్ చేసి పొజిషన్ పట్టాలు జారీ చేయడం సరికాదన్నారు. వెంటనే రద్దు చేసి నిబంధ నలు ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎరుకలి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

జగ్గాపురంలో రోడ్డు పనులకు శ్రీకారం

నందవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గాపురంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, గడంగం నరసింహులు, గట్టాల రంగన్న పనులు ప్రారంభించారు. కిందగేరిలో రూ.6 లక్షలతో రోడ్డు, డ్రైనేజీలు, నీటి కోసం కొత్తగా గుమ్మిలు కూడా నిర్మించారు. అలాగే పైగేరిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తిమ్మప్ప, ఎల్ఐసీ గోపాల్, దస్తగిరి, ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.

మారెమ్మను దర్శించుకున్న టీడీపీ నాయకులు

పెద్దకడుబూరు , జనవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చగిరి గ్రామంలోని మారెమ్మ అవ్వ దేవరను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంభాలతో ఆలయం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మారెమ్మ అవ్వను టీడీపీ నాయకులు రామకృష్ణ రెడ్డి, బసలదొడ్డి ఈరన్నలు, మధుసూదన్ రెడ్డి, నీలకంఠ రెడ్డి, దశరథరాముడు, ఆంజినయ్య, బాబు దర్శించుకున్నారు. వైసీపీ రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

కులుమాలలో ఉపాధి పనులు

గోనెగండ్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కులుమాల గ్రామంలో బుధవారం ఉపాధి పనుల కింద పంటలకు నీరు అందించే వన్‌ఎల్ కాలువ దగ్గర పనులు చేపట్టినట్టు సీనియర్ మేటి చాంద్ బాషా తెలిపారు. కాలువ గట్లు పిచ్చి మొక్కలు, గడ్డితో నిండి పోవడంతో నీరు సక్రమంగా పొలాలకు వెళ్లడం లేదు. దీంతో గ్రామానికి చెందిన కూలీలు పనులు చేసి కాలువకు ఉన్న గడ్డిని తీసివేశారు.

మారని తీరు

● అనవసర విషయాలపై వాగ్వాదం
● బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన కౌన్సిల్

ఎమ్మిగనూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల తీరు ఏ మాత్రం మారలేదు. కౌన్సిల్ సమావేశాల్లో జరుగుతున్న వాగ్వాదాలపై పట్టణ ప్రజలు ఈసడించుకుంటున్నా ప్రతిపక్ష, అధికార సభ్యుల తీరు ఏ మాత్రం మారడంలేదు. ఎవరేమనుకుంటే మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తూ కౌన్సిల్ సమావేశంలో అనవసర విషయాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు వాగ్వాదాలకు దిగుతుండడం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో ప్రవేశపెట్టిన అంశాలను ఒక్కొక్కటిగా చదువుతుండా మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ లేచి బడ్జెట్‌ను ఆమోదిస్తున్నామని చెప్పడంతో సభ్యులు ఆమోదించారు. అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో 15శాతం నిధులు పెంచడం హర్షణీయమన్నారు. అలాగే ఎస్సీలకు, మహిళా సంక్షేమానికి ప్రత్యేక గ్రాంట్లు పెట్టారన్నారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ప్రతిసారి మిగులు బడ్జెట్‌గా ఉండడం హర్షణీయమన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలో మిగిలిన బడ్జెట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆ మున్సిపాలిటీ వినియోగించుకునేవిధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామని చెబుతుండగా మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అడ్డు తగిలారు. ఏప్రిల్ నుంచి మీ ప్రభుత్వం ఎక్కడ ఉందని ప్రశ్నించడంతో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదానికి దారితీసింది. వైస్ చైర్మన్ దయాసాగర్ దీనిపై పూర్తి వివరాలను చెబుతుండగా వైస్ చైర్మన్ మరోసారి అడ్డు తగిలి మాకు క్లారిటీ చెప్పాలని, ఎప్పటి నుంచి ఆదేశాలు ఇచ్చారోనని ప్రశ్నించడంతో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అంతేగాక ఒకటో వార్డు వైసీపీ కౌన్సిలర్ నాగేషప్ప కల్పించుకొని అనవసర విషయాలు మాట్లాకుండా వార్డులో సమస్యలు మాట్లాడాలని పేర్కొనడంతో టీడీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ బడ్జెట్‌పై మాట్లాడుతుంటే అనవసర విషయాలు అంటారా అంటూ నాగేషప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి తర్వాత ఒకరు మాట్లాడాలని చెబుతున్నా.. ఏ మాత్రం పట్టించుకోకుండా మధ్యలో మాట్లాడడం సరైందికాదని మండిపడ్డారు. దీంతో చైర్మన్ రఘు వైస్ చైర్మన్ నజీర్‌ను కూర్చోమని చెప్పడంతో ఆయన కుర్చున్నట్లు కూర్చొని తిరిగి లేవడం పట్ల టీడీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.


వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ, వైసీపీ సభ్యులు

సమస్యలపై ఏకరువు పెట్టిన సభ్యులు: పట్టణంలోని 1వ వార్డులో కుక్కలు అధికంగా ఉన్నాయని కౌన్సిలర్ నాగేషప్ప అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వైస్ చైర్మన్ దివ్యకళ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని పాత మారెమ్మగుడి దగ్గర బోరు పనిచేయడం లేదని తెలిపారు. కొన్ని నెలలుగా సభ్యులకు గౌరవ వేతనం కూడా రావడంలేదని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. తనను వైస్ చైర్మన్-2గా వ్యవహరిస్తున్నారని, ఏమైనా ప్రభుత్వం అలా జీవో ఇచ్చిందా.. ఇచ్చి ఉంటే నాకు ఒక కాపీ ఇవ్వాలని ఆమె కమిషనర్‌ను కోరారు. ఇంతకు ముందు 6వ వార్డు కౌన్సిలర్ శివకుమార్ మాట్లాడుతూ మా వార్డులో గతంలో రోడ్లు వేసేందుకు టెండర్లు వేసి పనులు చేయకుండ కాంట్రాక్టర్ తిరిగి టెండర్లలో పాల్గొంటున్నారని, ఈయనను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. 3వ వార్డు కౌన్సిలర్ స్వాతి మాట్లాడుతూ వార్డులో కొత్త పైపులైన్ వేయాలని కోరారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామన్నారు.

బడ్జెట్‌కు ఆమోదం: కౌన్సిల్ సమావేశంలో 2025-26 బడ్జెట్ రూ.72,20,66,856 లతో అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. సాదారణ ఖర్చుల కింద రూ.14,83,95,00, మూలధనం ఖర్చు కింద రూ.14,16,20,000, రుణాల చెల్లింపుతో కలిపి మొత్తం ఖర్చు రూ.29,40,15,000 లుగా చూపారు. అయితే మిగులు బడ్జెట్ కింద రూ.42,80,51,856 చూపుతున్నారు. సమావేశంలో కమిషనర్ గంగిరెడ్డి, మేనేజర్ ప్రసాద్, డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు రాందాసుగౌడు, రాజారత్నం, కాశీం బేగ్, ఇసాక్, అమాన్, బజారి పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర

కోసిగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత కోసిగిలో జరుగుతున్న మారెమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారి రథోత్సవాన్ని మారెమ్మ దేవాలయాలకు తీసుకువచ్చి ఉత్సవమూర్తులను అధిష్ఠించి పూజలు ప్రారంభించారు. బుధవారం ఉదయం కోసిగిలోని కింది మారెమ్మ దేవాలయం, ముసలి మారెమ్మదేవాలయం, సిద్దప్పపాలెం మారెమ్మ దేవాలయం, నాడుగేనిగేరి దేవాలయం, రంగప్పగట్టు మారెమ్మ దేవాలయాల్లో భక్తులు డప్పు వాయిద్యాల మధ్య, కలశాలతో, పూర్ణ కుంబాలతో ర్యాలీగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డిలు హాజరయ్యారు. మారెమ్మ అమ్మవార్లను నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఎంపీ బస్తిపాటి నాగరాజును, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి నాయకులు ముత్తురెడ్డి, చింతలగేని నర్సారెడ్డి భారీ గజమాలతో సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డిని టీడీపీ నాయకుడు నాడిగేని మాదేవ గజమాలతో సన్మానించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, చింతలగేని నర్సారెడ్డి, కొండగేని వీరారెడ్డి, రవితేజశెట్టి, ఎల్లారెడ్డి, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూర్ణకుంభాలు, కలశాలతో ర్యాలీగా వెళ్తున్న భక్తులు


ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాఘవేంద్రరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


చేనేత కార్మికురాలికి గుర్తింపు కార్డు ఇస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తేరుబజారులో ఎన్‌హెచ్ డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూలు పాసుపుస్తకాలు, విద్యుత్ చార్జీల రాయితీ కార్డులు, గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరులో చేనేతల సంక్షేమం కోసం పద్మశ్రీ మాచాని సోమప్ప ఎంతో కృషి చేశారన్నారు. అలాగే తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి సైతం అనేక సంక్షేమ పథకాలు చేనేతలకు అందజేసి వారి సంక్షేమానికి కృషి చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు వార్డు కౌన్సిలర్లు, చేనేత నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో చేనేత జౌళిశాఖ ఏడీహెచ్‌లు అప్పాజి, నాగరాజు, ఏడీవో పెద్దయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలకంఠ, నరసింహులు, మాస్టర్ వీవర్స్ నజీర్, పెద్ద రంగస్వామి, మోనె వెంకటేష్, రామలింగప్ప, టీడీపీ చేనేత నాయకులు చేనేత మల్లి, మాచాని శివశంకర్, మాచాని శివకుమార్, మినప్ప, నరసప్ప, కామర్తి మహేష్, దోమ భీమేష్, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లైటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే: ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు బైపాను రోడ్డులో ఎద్దుల మార్కెట్ నుంచి గోనెగండ్ల సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని పెసలదిన్నె గ్రామంలో జరిగిన దస్తగిరి స్వామి ఉరుసులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. దస్తగిరిస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని టీడీపీ నాయకుల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.

కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు

పెద్దకడుబూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త డోలు రామాంజినేయులు మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు రఘునాథ్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలోని ఆనారోగ్యంతో డోలు రామాంజినేయులు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మన్న, పల్లెపాడు రామిరెడ్డి, బుసి రెడ్డి, ఏసేబు, మీసేవ ఆంజినేయులు పాల్గొన్నారు.

20 నుంచి మళ్లీ రీ సర్వే

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ నెల 20 నుంచి రీ సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో రీ సర్వే చేయకుండా నిలిచిపోయిన గ్రామాల్లో రీ సర్వే చేపడతామన్నారు. ఇదిలా ఉండగా గతంలో చేపట్టిన రీ సర్వేతోనే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటి వరకు వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. మళ్లీ రీ సర్వే పనులు చేపడితే మిగిలిన రైతులు కూడా తాము ఎక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

గోనెగండ్ల, జవనరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య, సూచించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ఉగాది వస్తాం' అన్నశీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం సాయంత్రం చిన్నమరివీడు గ్రామంలో ఏపీడీ అల్లివీర, ఎంపీడీవో మణి మంజరితో కలిసి పీడీ ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనే పనులు కల్పిస్తున్నామని, వలసలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వలసలు వెళ్లితే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. అలాగే గ్రామాలలో ఉపాధిపనులు చేస్తే రోజుకు రూ. 300 కూలీ వస్తుందని తెలిపారు. ఏపీవో మహమ్మద్ బాషా, ఈసీ ఉస్మాన్, సీనియర్ మేటిలు వీరేష్, మద్దిలేటి టీఏ, కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నందవరం, జనవరి, 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలగూడురు గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్ర ఏర్పాటుకు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ సోమలగూడురు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టి గురించి గ్రామంలో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో ఇబ్బందికరంగా ఉండే ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు మార్కింగ్ పనులు చేపట్టారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఖాళీ పేట్లు పట్టుకొని భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబిర్‌బాషా, రాష్ట్ర సమితి సభ్యులు విజయేంద్ర మాట్లాడుతూ పాదయాత్రలో నారాలోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంతో పాటు ఈ ఏడాది నుండే తల్లికి వందనం డబ్బులను జమచేయాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రంగస్వామి, విష్ణు, అబ్దుల్, ఖాదర్, రవి, వీరేష్, మోహన్, సమీర్‌లు పాల్గొన్నారు.


భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుష్కరిణి నిర్మాణానికి స్థల పరిశీలన

మంత్రాలయం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి ఆలయంలో పుష్కరిణి నిర్మాణానికి స్థలాన్ని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి, మేనేజర్-సి ఈఈ సురేష్ కోనాపూర్ పరిశీలించారు. బృందావనం గార్డెన్, నూతన సుజీంద్ర గెస్టు హౌస్, సర్వజ్ఞ మందిరం మధ్యలో ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. దాదాపు 160 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు, ఆరు అడుగుల లోతు, చుట్టూ పది మెట్లు ఉండే విధంగా డిజైన్ చేశారు. ఇందుకు మఠం ఆధ్వర్యంలో రూ.రెండు కోట్ల వెచ్చించనున్న ట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వారి వెంట ఏఈలు ఏఈ బద్రినాథ్, శ్రీహరి, గురుదాస్, దేవాదాయ శాఖ కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్ హెచ్‌జే వెంకటేశ్వర్లు, శ్రీమఠం జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, విజేంద్రాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు ఉన్నారు.

శాకంబరి అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం గ్రామదేవతగా పూజలందుకుంటున్న మంచాలమ్మ అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ధనుర్మాసం నవమి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మంచాలమ్మకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో శాఖాంబరి దేవిగా అలంకరించారు. పీఠాధిపతి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

సుస్థిరాభివృద్ధి సాధించాలి

మంత్రాలయం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సుస్థిరాభివృద్ధి సాధించేందుకు ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కృషి చేయాలని ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కే.బాలు అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రాలయం సెక్టార్ ఆవరణంలో సీడీపీవో నాగమణి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సుస్థిరాభివృద్ధి సాధించేందుకు అంశాలు, బాలసంజీవని, పోషణ ట్రాక్టర్ యాప్‌లపై చర్చించారు. ఐసీడీఎస్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల బరువు ఎత్తు, గ్రేడ్లలో ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, విజయకుమారి, భాగ్యలక్ష్మి బాయి, కాత్యాయని, గోవిందమ్మ, సులోచన, షేక్షావలి, సుప్రియ అయ్యన్న, నరసమ్మ, తులసమ్మ, అనిత, నాగవేణి, భారతి, మీనాక్షి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. బుధవారం కొటేకల్లు గ్రామంలో తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో మొత్తం 598 అర్జీలు రాగా 200 అర్జీలను పరిష్కరించామన్నారు. సదస్సుల్లో పాల్గొనని రైతులు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ జ్యోతిర్మయి, వీఆర్వోలు ఈరన్న, టీడీపీ నాయకులు నాగయ్య, రాముడు పాల్గొన్నారు.

మంత్రాలయం: గత నెలలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు మండలంలో బుధవారంతో విజయవంతంగా ముగిశాయి. మండలంలోని చౌలహళ్లి గ్రామంలో వీఆర్వో రాజు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో అర్జీలు చేసుకున్న రైతులకు న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ ఆదాం, వీఆర్వో నరసప్ప, సర్వేయర్ చిట్టి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని నదీకైరవాడి గ్రామంలో రీ సర్వే గ్రామ సభపై అవగాహన ర్యాలీ కార్యక్రమం డీటీ మహేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు రీ సర్వేపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐ-టీడీపీ తాలుకా అధ్యక్షుడు కురవ వీరేష్, డీలర్‌బజారి, వీరారెడ్డి పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీ ఆదాయం పెంచాలి

గోనెగండ్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ తప్పనిసరిగా గ్రామ పంచాయతీలో వర్మీ కంపోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు గంజహళ్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం గంజహళ్లి గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసేందుకుగాను చెత్త తొట్లలో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టును తయారు చేసి అమ్మి పంచాయతీకి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేసున్నామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, వీధిదీపాల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

నందవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు బుధవారం జెండా ఆవిష్కరించారు. నిరుపేదలకు భూములు పంచిన ఘనత సీపీఐదే అన్నారు. ప్రతి నిరుపేదకు ఇంటి స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో నిరంతరం పేదల తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గిడ్డయ్య, అబ్దుల్ రవుఫ్, నబి, కాశీం, తిమ్మప్ప, ఈరన్న పాల్గొన్నారు.